

# సిద్దిపేట సంగారెడ్డి మెదక్

బుధవారం 13 ఆగస్టు 2025 పేజీలు : 10


# సదాశివపేట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



సదాశివపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల నాణ్యత, రోగులకు అందిస్తున్న సౌకర్యాలను జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఉదయం సమయంలో ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కలెక్టర్ ఆసుపత్రి ప్రాంగణంలో ప్రవేశించి, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. తనిఖీ సమయంలో ఉద్యోగుల హాజరు నమోదు రిజిస్టర్ పరిశీలించి, విధులకు హాజరు కాని కొంతమంది డాక్టర్లపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.

# మాది పేదల సంక్షేమ ప్రభుత్వం

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళలాంటివి
- 223 మందికి రూ 63లక్షల సిఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణి
- విద్య, వైద్యానికి ప్రాధాన్యమిస్తున్న తెలంగాణ ప్రభుత్వం
- రూ 200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నాం
- బిఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వాలె
- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావ్



# మిగిలిన గ్రామాలను ఇస్నాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేయండి



- ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, పాలిటెక్నిక్ కళాశాలలకు త్వరితగతిన భూమి కేటాయింపులు చేయండి
- పాశమైలారం పరిధిలో కుంటలను కబ్జాల నుండి కాపాడండి
- జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు మండల పరిధిలోని భానూరు, నందిగామ, క్యాసారం గ్రామపంచాయతీలను సమగ్ర అభివృద్ధి కోసం ఇస్నాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్యను పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం సంగారెడ్డి లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ తో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై కలెక్టర్ తో చర్చించారు. ప్రధానంగా ప్రభుత్వం ఇటీవల పటాన్ చెరు నియోజకవర్గం పరిధిలో ఇంద్రేశం, జిన్నారం కేంద్రాలుగా నూతన మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడంతో పాటు.. వీటి పరిధిలోని గ్రామాలను డీ నోటిఫికేషన్ చేస్తూ గెజిట్ విడుదల చేసిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యం





- డిపిఎం ప్రకాష్
- ఎస్సై మానస




**రాయపోల్ ఆగస్టు 12 ప్రజా జ్యోతి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో ఒక ముఖ్యమైన కార్యక్రమం అర్హులైన మహిళలందరినీ కొత్త మరియు ఇప్పటికే ఉన్న స్వయం సహాయక సంఘాలలో చేర్పించాలని డిపిఎం ప్రకాష్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండల కేంద్రంలో గ్రామ సంఘం లీడర్లకు మరియు వీఓఏలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘంలో లేని మహిళలను గుర్తించి సంఘంలో చేర్పించాలి అదేవిధంగా, దివ్యాంగుల సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి మిషన్ 2025లో భాగంగా ఒక కోటి మంది మహిళలను స్వయం సహాయక సంఘాల ద్వారా కోటీశ్వరులు చేయడమే లక్ష్యం అన్నారు. ఈ సంవత్సరంలో వృద్ధులను, దివ్యాంగులను, మహిళలను మరియు కిషోర్ బాలికలను సంఘాల్లో చేర్పించాలని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే వారి యొక్క జీవన ప్రణాళిక మెరుగుపడుతుందన్నారు. రాయపోల్ ఎస్సై మానస మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా రుణాలు పొంది మహిళలు ఎంతగానో అభివృద్ధి సాధిస్తున్నారని ఆమె తెలిపారు. మహిళలపై అత్యాచారాలు లాంటి సంఘటన జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 100 కు కాల్ చేయాలన్నారు . వెంబడే మీ సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై శ్రద్ధ చూపించాలని కోరారు. ప్రతిరోజు తమ పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రుల గమనించాలన్నారు. విద్యార్థి దశనుండే వారి జీవిత లక్ష్యాన్ని ఎంచుకునే విధంగా తల్లిదండ్రులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం యాదగిరి, సీసీలు కిష్టయ్య రాజేశ్వరరావు , ప్రవీణ్ , మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు కవిత , సౌందర్య, సాజిత, వివో ఏలు గ్రామ సంఘం లీడర్లు పాల్గొన్నారు.

# రైతులకు సరిపడే యూరియాను అందించాలి



**నంగునూరు( ప్రజా జ్యోతి )** నంగునూరు లో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులకు సరిపడా ఎరువులను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నంగునూరు మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నంగునూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఉలాగుల సారయ్య, ఎడ్ల సోమిరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ కోల రమేశ్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కూతురు రాజిరెడ్డి, అనగోని పరశు రాములు, గౌడ్ తాళ్ళపల్లి వీరయ్య గౌడ్, చింతల రాంరెడ్డి ఉల్లి మల్లయ్య, రచ్చ సిద్ధు, గోనేపల్లి సిద్దేశ్వర్ గౌడ్, శనిగరం బాబు, , ఎం డి అజిత్ దేవులపల్లి కనకయ్య, మ్యాక కనకయ్య, ఆరేపల్లి రాజయ్య, వర్దోలు ఆయిలయ్య ఈ ధర్నాలో మాట్లాడుతూ నంగునూరు మండలం 20 వేలకు పైగా ఎకరాలలో వరి, మొక్కజొన్న, పత్తి, ఇతర పంటలు సాగయ్యాయని చెప్పారు. ఈ పంటలకు సరిపడా ఎరువులను సరఫరా చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం అయ్యిందన్నారు. పంట సాగు అంచనాలను రూపొందించుకొని అందుకు అనుగుణంగా ముందస్తుగా ఎరువులను నిలువ చేయాల్సి ఉండగా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. ఆన్లైన్ నమోదు పేరిట ఒక రైతుకు ఒక ఎకరానికి ఒక బస్తా నిబంధన విధించడం సరైనది కాదన్నారు. డిమాండ్ కు అనుగుణంగా ఎరువులను నిలువ చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇప్పటికే గత ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులను పడుతున్నారని చెప్పారు. రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో రైతులు రుణ విముక్తులు కాలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులందరికీ సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఎరువుల కొరతను తీర్చకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం మండల తహశీల్దార్ కు వినతి పత్రం అందజేశారు.

## జిల్లాలో పోలాలు ఎండుతున్నాయి

**వందలాది టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయి**

**మంత్రులకు సోయి లేదు : మాజీ మంత్రి జగదీష్ రెడ్డి**

**నల్గొండ :** నాగార్జునసాగర్ నుంచి వందల టీఎంసిల నీరు సముద్రంలో కలుస్తున్నా జిల్లాలో సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి విమర్శించారు. ఏఎంఆర్పీ కాలువ కింద చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడం లేదు. జిల్లా మంత్రులకు చిత్తశుద్ధి లేదు. ఏపీ కి నీళ్ల వదిలేంత ఆతృత, జిల్లాలో రైతులకు నీళ్ల ఇవ్వాలనే తపన లేదని అన్నారు. మా పాలనలో వరుసగా 8 ఏళ్ల చెరువులు నిండుగా ఉంచి? ప్రతి ఎకరాకు సాగునీరు ఇచ్చాం. ఏఎంఆర్పీ లిఫ్ట్ కింద డి25, డి26, డి29, డి31, డి39, డి డిస్ట్రిబ్యూటరీల కింద 70 వేల ఎకరాలకు నీళ్ల అందించిన ఘనత బీఆర్ఎస్ దే. కోమటిరెడ్డి మంత్రి అయిన తర్వాత మళ్లీ పొలాలు ఎండిపోతున్నాయి. హెలికాప్టర్ల ఆర్భాటాలు, కమిషన్ దందాలు తప్ప రైతుల పట్ల ప్రేమ లేదని అన్నారు. గోదావరి నీటిని ఆంధ్రకు కట్టబెట్టే యత్నాలు జరుగుతున్నాయి. రైతులు ధర్నా చేస్తే కేసులు పెట్టడం దుర్మార్గం. కనీసం ఉదయ సముద్రం నింపడంలేదని అన్నారు. కోమటిరెడ్డి ? ఉత్తమ్ ఇద్దరూ అసమర్థులే. కృష్ణ జలకళ ఉన్నా, జిల్లాలో చెరువులు ఎండిపోయి కనిపిస్తున్నాయి

## విషయ పరిజ్ఞానానికి గ్రంథాలయాలు అవసరం

**సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి**



**హుస్నాబాద్, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):** విషయ పరిజ్ఞానానికి గ్రంథాలయాలు అవసరమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని రిటైర్డ్ ఉపాధ్యాయుల భవనంలో మంగళవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవం నిర్వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భారతదేశ గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో త్వరలో హుస్నాబాద్ లో గ్రంథాలయం ఏర్పాటు అవుతుందన్నారు. హుస్నాబాద్ ను ఎడ్యుకేషన్ హబ్ గా మార్చేలా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. గ్రంథాలయాలు జ్ఞాన కేంద్రాలని, గ్రంథాలయాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ పట్టణ కవులు, మేధావులు, పలు రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఎస్ఐ బి సౌజన్య**




**బెజ్జంకి ఆగస్టు 12, ప్రజా జ్యోతి :** వాతావరణ శాఖ తెలిపిన సమాచారం మేరకు, రాబోయే రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సిద్దిపేట జిల్లా పోలీస్ కమీషనర్ బి అనురాధ ఆదేశాల మేరకు, ఎస్ఐ బి సౌజన్య బెజ్జంకి మండల ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రహదారి మీద ప్రయాణించే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, చేపల వేటకు వెళ్లకూడదని, వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యే వారు పిడుగుపాటుకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈత రాని పిల్లలు, పెద్దలు చెరువు, కుంటలలో ఈతలకు వెళ్ళకూడదని, పాత ఇండ్లలో నివాసం ఉండే వారు అతిగా వర్షం కురిసినప్పుడు కూలే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని, కరెంట్ స్తంభాలకు,, తీగలకు లకు దూరంగా ఉండాలని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఏదైనా అవాంఛనీయ సంఘటన గాని, ప్రమాదాలు జరిగిన వెంటనే పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు.

# మాది పేదల సంక్షేమ ప్రభుత్వం

**అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళలాంటివి**

**223 మందికి రూ 63లక్షల సిఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణి**

**విద్య, వైద్యానికి ప్రాధాన్యమిస్తున్న తెలంగాణ ప్రభుత్వం**

**రూ 200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నాం**

**బిఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వాలె**

**మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావ్**



**మెదక్ (ప్రజాజ్యోతి )12 ఆగస్టు :** మాది పేదల ప్రభుత్వమని.. తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా పాలన ప్రభుత్వంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావ్ అన్నారు. అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వానికి రెండు కళ్ళలాంటివని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని జికెఆర్ గార్డెన్స్ లో మెదక్ నియోజక వర్గం లోని 223 మంది లబ్ధిదారులకు రూ 63లక్షల విలువ గల సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన విదంగా ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. అన్నదాతలకు రైతు భరోసా, రుణమాఫీ అందజేసినట్లు తెలిపారు. నియోజకవర్గం లో మౌళిక వసతుల కల్పన కోసం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులు తెచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మెదక్ ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి కష్ట సుఖాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. రామాయంపేట పట్టణంలో రూ 200కోట్ల తో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని తెలిపారు. పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణ లో ప్రసిద్ధి గాంచిన ఏడుపాయల దుర్గ భవాని టెంపుల్, ప్రపంచంలో ప్రసిద్ధి గాంచిన మెదక్ చర్చిల అభివృద్ధికి గత ప్రభుత్వం ఒక్కరూపాయి కూడా కేటాయించ లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమం లో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి,పాపన్నపేట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, శంకర్, బ్లాక్ కాంగ్రెస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొజ్జ పవన్, శ్రీనివాస్ చౌదరి,మహేందర్ రెడ్డి, నాగరాజు, ఆంజనేయులు గౌడ్, లింగం, శంకర్, రాజిరెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్ క్రిష్ణ, కోర్వి రాములు, హంజాద్, లల్లూ, మహిపాల్ యూత్ కాంగ్రెస్ మెదక్ నియోజకవర్గ అధ్యక్షులు భరత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల లో తనిఖీలు నిర్వహించి నివేదిక సమర్పించాలి





**ఔషధ యూనిట్లలో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్ (ప్రజాజ్యోతి) 12 ఆగస్టు :** రసాయన ,ఔషధ పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించకుండా తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రజావాణి హాల్ నందు ఫ్యాక్టరీలు, రసాయన పరిశ్రమల్లో భద్రతపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీతో సమావేశం నిర్వహించారు. గత జూన్ 30 న సంగారెడ్డి జిల్లా, పాశమైలారం లో సంభవించిన అతిపెద్దవిస్ఫోటనాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాక్టరీలు, ప్రత్యేకించి రసాయన పరిశ్రమలు, ఔషధ యూనిట్లలో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో భాగంగా జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు చేసి, ఆ కమిటీల ద్వారా ఆయా పరిశ్రమలలో భద్రతను తనిఖీ చేసి నివేదికలను సమర్పించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ అంశం పై మెదక్ జిల్లాలో జిల్లా కలెక్టర్ పరిశ్రమలు, కార్మిక ,కాలుష్య నియంత్రణ మండలి, తదితర సంబంధిత శాఖల అధికారులతో జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్మికులు భద్రతపై దృష్టి సారిస్తూ కర్మాగారాలలో పనిచేసే కార్మికుల యొక్క :ఫోన్ నంబర్స్ పూర్తి సమాచారం యాజమాన్యం దగ్గర ఉండాలని, పరిశ్రమలలో పనిచేసే కార్మికులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా, చూడాలని, మత్తు పదార్థాలు వాడుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిన పక్షంలో యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్యాక్టరీల డైరెక్టర్ అంతర్నిర్మిత భద్రతా వ్యవస్థలను అభివృద్ధి చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి కమిటీ ఆయా రసాయనిక పరిశ్రమలు, ఔషధ యూనిట్లను తనిఖీ చేసి నిర్దేశించిన ప్రొఫార్మా లో నివేదిక సమర్పించాలని , ఇదే అంశంపై నివేదిక అందిన తర్వాత తిరిగి సమీక్షిస్థానని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని పరిశ్రమలు ,రసాయనిక, ఔషధ యూనిట్లలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత ఉందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ ,ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, తూప్రాన్ జై చంద్ర రెడ్డి, జడ్పీ సీఈవో ఎల్లయ్య ,డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మోహన్ బాబు,డైరెక్టర్ ఆఫ్ బాయిలర్స్ శ్రీనివాసరావు, కర్మ గారాల జిల్లా ఉప ప్రధాన అధికారి శ్రీమతి లక్ష్మి కుమారి, జిల్లా పరిశ్రమల మేనేజర్ ప్రకాష్ రావు జిల్లా అగ్నియాపక శాఖ అధికారి, కాలుష్య నియంత్రణ మండలి, కార్మిక శాఖ అధికారులు,ఇతర సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## బోధనాభ్యాసన సామాగ్రి మేళా

**-మండల విద్యాధికారి సీతారాం**

**-ప్రధానోపాధ్యాయులు సాంబయ్య**




**వెల్దుర్తి ప్రజాజ్యోతి ఆగస్టు 12** వెల్దుర్తి మండల కేంద్రంలో మంగళవారం మండల విద్యాశాఖ అధికారి ఎన్ సీతారామ ఆధ్వర్యంలో మండల స్థాయిలో బోధనాభ్యాసన సామాగ్రి మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల విద్యాధికారి సీతారాం మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా, కొత్త బోధనా పద్ధతులు, సామాగ్రిని నేర్చుకోవడం మరియు వాటిని తరగతి గదిలో ఎలా ఉపయోగించాలో తెలుసుకోవచ్చు అన్నారు. విద్యార్థుల అభ్యసనను మెరుగుపరుస్తుంది: బోధనా సామాగ్రిని ఉపయోగించి, విద్యార్థులు భావాలను సులభంగా అర్థం చేసుకోవడానికి మరియు విషయాలను బాగా గుర్తుంచుకోవడానికి సహాయపడుతుందన్నారు. కొత్త బోధనా పద్ధతులు మరియు సామాగ్రిని ఉపయోగించడం ద్వారా, బోధన మరింత ఆసక్తికరంగా మరియు ప్రభావవంతంగా ఉంటుందన్నారు. బోధనాభ్యాసన సామాగ్రి మేళా విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి దోహదపడుతుందన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు సమయ మాట్లాడుతూ మేళా ప్రదర్శన యొక్క ప్రధాన లక్ష్యాలు ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలో బోధనకు అవసరమైన సామాగ్రిని వినియోగిస్తూ భోజనం చేయాలని,బోధన అభ్యాసన సామాగ్రిని నిత్యం తయారు చేసుకునే విధంగా సూచన చేయడం జరిగిందని, అమూర్త భావనపై అవగాహనకు అవసరమైన సామాగ్రిని తయారు చేసుకుని వినియోగించాలని, విద్యార్థుల స్వీయ అభ్యాసనకు అవకాశం పెంచడం,తరగతి సామర్థ్యాలకు అనుగుణంగా అభ్యసన సామాగ్రిని ప్రదర్శించడంతో తరగతి గదిని ఆకర్షణీయంగా తయారు చేయొచ్చు అన్నారు. ఈ మేళా కార్యక్రమంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల నుండి విద్యార్థులు టిఎల్ఎం తయారు చేసుకుని వచ్చి ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా రిటైర్డ్ మండల విద్యాశాఖ అధికారి ఏ యాదగిరి, వెల్దుర్తి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి సాంబయ్య, మరియు మండలంలోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు,యూనియన్ బాధితులు పాల్గొన్నారు.

## అరెస్ట్ లకు బెదిరేది లేదు

**మెదక్ లో ఎగిరేది బాజపా జెండానే**

**పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్**



**మెదక్ (ప్రజాజ్యోతి)** హైదరాబాదులో పెద్దమ్మ గుడి వద్ద బుధవారం నిర్వహించే సామూహిక కుంకుమార్చనకు బయలు దేరకుండా మెదక్ టౌన్ పోలీసులు బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, నల్లల విజయ్ కల్కి నాగరాజ్ బక్కవారి శివ, బీజేవైఎం మాడిశెట్టి లింగరాజు, ఓబీసీ భానులను ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ లకు భయపడేది లేదని పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్ స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎన్ని జిమ్మిక్కులు చేసిన రానున్న స్థానిక ఎన్నికలలో డైనమిక్ ఎంపీ రఘునందన్ రావు సారద్యం లో భారతీయ జనతా పార్టీ మెదక్ జెండా ఎగురావేస్తుందని దిమా వ్యక్తం చేశారు.

# సౌర విద్యుత్ ఏర్పాటుకు నివేదికలు అందించాలి

3 రోజులలో
జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలలో
జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




**మెదక్ (ప్రజాజ్యోతి) 12 ఆగస్టు–:** జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల లలో సౌర విద్యుత్ ఏర్పాటుకు 3 రోజులలో నివేదిక రూపొందించి సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, తూప్రాన్ జయచంద్ర రెడ్డి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, డిఎం రెడ్ కో రవీందర్ చౌహన్ లతో కలిసి జిల్లా అధికారులతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయా లు, పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులా లలో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వసతి గృహాలు, అన్ని యాజమాన్యాల గురుకులాలలో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందని, ఈ మేరకు ప్లాంట్ ఏర్పాటుకు కావలసిన వైశాల్యం, నెలకు విద్యుత్ వినియోగం వంటి వివరాలను నిర్ణీత నమూనాలో పూరించి 3 రోజులలోగా నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కార్యాలయాలలో ఖాళీ స్థలాల వివరాలను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు .

# మిగిలిన గ్రామాలను ఇస్నాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేయండి

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, పాలిటెక్నిక్ కళాశాలలకు త్వరితగతిన భూమి కేటాయింపులు చేయండి
పాశమైలారం పరిధిలో కుంటలను కబ్జాల నుండి కాపాడండి
జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు/ప్రజాజ్యోతి** పటాన్ చెరు మండల పరిధిలోని భానూరు, నందిగామ, క్యాసారం గ్రామపంచాయతీలను సమగ్ర అభివృద్ధి కోసం ఇస్నాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం సంగారెడ్డి లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ తో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై కలెక్టర్ తో చర్చించారు. ప్రధానంగా ప్రభుత్వం ఇటీవల పటాన్ చెరు నియోజకవర్గం పరిధిలో ఇంద్రేశం, జిన్నారం కేంద్రాలుగా నూతన మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడంతో పాటు.. వీటి పరిధిలోని గ్రామాలను డీ నోటిఫికేషన్ చేస్తూ గెజిట్ విడుదల చేసిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పటాన్ చెరు మండల పరిషత్ పరిధిలోని మొత్తం 19 గ్రామపంచాయతీలలో భానూరు, నందిగామ, క్యాసారం గ్రామాలు మాత్రమే మండల పరిధిలో మిగిలిపోయాయని తెలిపారు. మిగిలిన గ్రామాలు ఇస్నాపూర్, ఇంద్రేశం మున్సిపాలిటీల పరిధిలోకి వెళ్ళాయని పేర్కొన్నారు. పైన పేర్కొన్న మూడు గ్రామాలు మరింత అభివృద్ధి, మెరుగైన పరిపాలన సౌలభ్యం కోసం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో విలీనం చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కోరారు. గతంలో కోరిన విధంగా నియోజకవర్గానికి నూతనంగా మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాల నిర్మాణం కోసం పటాన్ చెరు రెవెన్యూ పరిధిలోని పోచారం గ్రామ పరిధిలో గల సర్వే నంబర్ 69లో త్వరితగతిన భూమి కేటాయింపులు చేయాలని మరోమారు విజ్ఞప్తి చేశారు. ఈ విద్యా సంవత్సరం నుండి పాలిటెక్నిక్ కళాశాలకు సంబంధించిన తరగతులు పటాన్ చెరు పట్టణంలోని డిగ్రీ కళాశాల భవనంలో ప్రారంభమయ్యాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వచ్చే విద్యా సంవత్సరం లోపు భవన నిర్మాణాలు పూర్తయితే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం ప్రభుత్వం ఇప్పటికే 200 కోట్ల రూపాయలు నిధులు కేటాయించడంతో భూమి కేటాయించిన వెంటనే పనులు ప్రారంభించవచ్చని పేర్కొన్నారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం గ్రామ పరిధిలో గల కొత్త కుంట, పాపాయిగూడ కుంట, గొల్లవానికుంట, ఉబ్బాని కుంట, వడ్లవానికుంట, ఆరోటోని కుంటల పరిధిలోని 39 ఎకరాల ఆరు గంటల భూమి పూర్తిగా ఆక్రములకు గురైందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కుంటలు ఆక్రమణలకు గురి కావడం మూలంగా వీటిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకార కుటుంబాలు స్థానిక పరిశ్రమలలో కూలీలుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆరు కుంటల పరిధిలో ఆక్రమణలు తొలగించి చేపల పెంపకానికి అనువుగా తీర్చిదిద్దాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై ఇప్పటికే హైడ్రా కమిషనర్ తో పాటు, నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ అధికారులకు సైతం విన్నవించడం జరిగిందని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రావిణ్య త్వరలోనే భూమి కేటాయింపులపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాశమైలారం గ్రామ పరిధిలో కుంటల అక్రమలపై వెంటనే విచారణ చేపడతామని తెలిపారు.

## పోలీసు అధికారుల సమీక్షా సమావేశం

తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్.



**తూప్రాన్ ప్రజాజ్యోతి ఆగస్టు 12** తూప్రాన్ డివిజనల్ కార్యాలయంలో డీఎస్పీ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో సీఐలు మరియు ఏఎస్ఐలతో కలిసి ఆగస్టు నెలలో జరిగిన క్రైమ్ రివ్యూ సమావేశం నిర్వహించారు. జూలై నెలలో నమోదైన కొత్త కేసులు, పాత పెండింగ్ కేసులు, నేటికీ పూర్తికాని విచారణలు, పెండింగ్‌లో ఉన్న ఎన్ బి డబ్ల్యూ పై సమీక్ష నిర్వహించారు. సీసీ కెమెరాల వ్యవస్థాపన, వాటి సక్రమమైన పనితీరు, భద్రతా చర్యలపై చర్చించారు. ఇందులో భాగంగా అధికారులు వద్ద పెండింగ్‌లో ఉన్న జి2, సిసిసి పిటిషన్ల పరిష్కారం పై సూచనలు చేశారు. రాబోయే లోక్ అదాలత్‌కు సంబంధించిన ఏర్పాట్లు, పరిష్కార చర్యలు, గణేష్ ఉత్సవం సందర్భంగా నిబంధనలు, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల సౌకర్యాల కోసం చేపట్టవలసిన చర్యలపై ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు. ఇందులో డివిజన్ పరిధి సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు

## అప్పుల బాధ భరించలేక.. ఓ యువకుడు మృతి.



**చిన్నశంకరంపేట (ప్రజా జ్యోతి)** అప్పుల బాధ భరించలేక ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, సోమవారం రాత్రి మృతి చెందినట్లు స్థానిక ఎస్సై నారాయణ మంగళవారం తెలిపారు. చిన్నశంకరంపేట మండలం గవ్వల పల్లి పంచాయతీ బంటు కుంట తండాకి చెందిన బానోత్ సురేష్ (30). అప్పుల బాధకు తాళలేక ఈనెల రెండో తేదీన పురుగుల మందు తాగినట్లు తెలిపారు. వీరిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ, రాత్రి 11 గంటల కు ఆసుపత్రిలో మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి ముగ్గురు సంతానం కలరు. మృతుని తల్లి బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ. నారాయణ తెలిపారు.

## సిర్గాపూర్ లో పట్టపగలే వీధి దీపాలు..అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



**సిర్గాపూర్ ఆగస్టు 12(ప్రజాజ్యోతి):** సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల కేంద్రంలోని శివాజీ కూడలిలో మంగళవారం పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నా అధికారులు పట్టించుకోక పోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోనే ఇలా జరగడం అధికారుల పనితీరుకు అద్దం పడుతుందని విమర్శిస్తున్నారు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని, ప్రజల పన్ను డబ్బు వృధా అవుతోందని వారు వాపోతున్నారు.

# వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

ఎస్.ఐ సోమేశ్వరి.



**కొండాపూర్ ప్రజా జ్యోతి....** మండలాల ప్రజలకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితే తప్ప బయటకు రావద్దని, రైతులు పొలాల దగ్గరకి వెళ్ళినప్పుడు కరెంట్ వైర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలి, భారీ వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ స్తంభాలు, వైర్లకు తాకకుండా తగు జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలని కొండాపూర్ ఎస్సై సోమేశ్వరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువులు వద్ద వరద ప్రవాహం అధికంగా ఉన్న చోట వద్దకి ఎవరు వెళ్లవద్దన్నారు. వర్షం నీటి వల్ల రోడ్డుపై వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉన్నందున, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. పిల్లలు, యువకులు చెరువులు, కాలువల దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉండకూడదు, వర్షం సమయంలో చెట్ల కింద ఉండటం వల్ల పిడుగుపాటుకు గురయ్యే అవకాశం ఉంది అందువల్ల చెట్లకింద ఉండరాదు,చేపలు పట్టుటకు,పశువులను మేపడానికి బయటకి వెళ్లకూడదని తెలిపారు. అత్యవసర సమయంలో 100 దయాల్, లేదా కొండాపూర్ పోలీస్ స్టేషన్ నెంబర్ ఎస్.ఐ నెంబర్ నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారం కొరకు

సిపిఎం ఆధ్వర్యంలో పల్లె బాట కార్యక్రమం.

ఉపాధి కూలీల డబ్బులు వెంటనే ఇవ్వాలి.

సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కే రాజయ్య డిమాండ్..



**కొండాపూర్ ప్రజా జ్యోతి** మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో సిపిఎం పార్టీ శాఖ ఆధ్వర్యంలో బస్తి పర్యటనలో భాగంగా సీపీయం మండల కార్యదర్శి కే రాజయ్య మాట్లాడుతూ గత రెండు మూడు నెలలుగా ఉపాధి కూలీ డబ్బులు వస్తా లేవని ఆవేదన వ్యక్తం చేశారు పనిచేసిన 15 రోజులలో డబ్బులు ఇవ్వాలని జీవో ఉన్న కూలి డబ్బులు రావట్లేదు వెంటనే కూలి డబ్బులు ఇవ్వాలని అలాగే పెన్షన్ పితంతులు వృద్దులు వికలాంగుల పెన్షన్ చాలామంది ఆరులుగా ఉండి గ్రామాలలో పెన్షన్ నోచుకునే పరిస్థితి ఉంది కాబట్టి వెంటనే కొత్త పింఛన్లు ప్రభుత్వము మంజూరు చేయాలి అలాగే ప్రభుత్వము ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం 2000 నుండి 4000 వరకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అన్నారు. అలాగే మహిళలకు2500 ఇస్తామని ఇవ్వట్లేదు చాలామందికి ఉచిత కరెంటు లబ్ధిదారులకు రావట్లేదు వెంటనే గ్రామాలలో సర్వే చేసి అర్హులు అయితే ఎవరున్నారో వారందరికీ అందే విధంగా గ్రామ పరిపాలన అధికారులు గ్యాస్ కరెంటు కొత్త పెన్షన్లు వచ్చే ప్రయత్నం చేయాలని అన్నారు. శాఖ పార్టీ సభ్యులు అమృతమ్మ, మానయ్య, అనసూయ, రాములమ్మ, యాదమ్మ, మొగులమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గుడులను కూల్చివేస్తూ హిందూ సంస్కృతి పై కాంగ్రెస్ దాడి చేస్తుంది

-అక్రమ అరెస్టులతో హిందువుల ఐక్యతను అడ్డుకోలేరు

-బజరంగ్ దళ్ ఆందోల్ మండల సంయోజక్ ఆంజనేయులు




**అందోలు, ఆగస్టు12, (ప్రజాజ్యోతి):** హిందూ సంస్కృతి సాంప్రదాయాలను ఇనుమడింపజేసే గుడులను, ఆలయాలను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేస్తూ హిందూ సంస్కృతిపై దాడి చేస్తుందని బజరంగ్ దల్ ఆందోల్ మండల సంయోజక్ ఆంజనేయులు విమర్శించారు. హైదరాబాదులోని జూబ్లీ హిల్స్ పెద్దమ్మ గుడి కూల్చివేతను నిరసిస్తూ హిందూ సంఘాలు అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించడానికి చలో జూబ్లీహిల్స్ బజరంగ్ దల్, విహెచ్ పి నాయకులను జోగిపేట పోలీసులు మందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆందోల్ మండల సంయోజక్ ఆంజనేయులు మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో హిందువుల ఐక్యతను అడ్డుకోలేరని అన్నారు. ఇటీవల బంజారాహిల్స్ లో కొలువై ఉన్న పాత పెద్దమ్మ తల్లి గుడిని ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో కూల్చివేయడం ప్రభుత్వం హిందూ సంస్కృతి పై చేస్తున్న దాడిగా అభివర్ణించారు. గత కొంతకాలంగా రాష్ట్రంలో మతి స్థిమితం లేని ఓ వర్గానికి చెందిన వారు హిందూ ఆలయాలలో చొరబడి విగ్రహాలను ధ్వంసం చేసినా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ఏకంగా కార్యక్రమానికి తెరలేపిందని, ఇది హిందువులపై ప్రభుత్వం చూపిస్తున్న అక్కసుకు పరాకాష్టగా భావించాలని అన్నారు. మనదేశంలో మన ఆలయాలకి, గుడులకి రక్షణ లేకుంటే రానున్న రోజుల్లో ఇంకా ఎన్ని దారుణాలు జరుగుతాయో ఆలోచించాలన్నారు. హిందూ సోదరులంతా ఏకంకావాలని, హిందూ సమాజం పై, సంస్కృతిపై జరుగుతున్న దాడిని అడ్డుకోవాలని, మన గుడులను మనమే కాపాడుకోవాలని హిందూ సమాజానికి పిలుపునిచ్చారు.

## పెద్ద శంకరంపేటలో బిజెపి నాయకుల ముందస్తు అరెస్ట్.




**పెద్ద శంకరంపేట్ ప్రజా జ్యోతి బీ** హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ వద్ద పెద్దమ్మ గుడి కూల్చివేతను నిరసిస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆలయం వద్ద కుంకుమార్చన కార్యక్రమానికి పిలుపు ఇవ్వడంతో మంగళవారం పెద్ద శంకరంపేట నుండి బిజెపి నాయకులు తరలి వెళ్తుండడంతో పేట ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.. హైదరాబాద్ తరలి వెళ్తున్న మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్.బిజెపి మండల పూర్వ అధ్యక్షుడు కోణం విట్టల్. మండల బిజెపి నాయకులు సుధాకర్ అనిల్. కృష్ణ తదితర బిజెపి నాయకులు పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు......

## పెద్ద శంకరంపేటలో భక్తిశ్రద్ధలతో సంకట చతుర్థి పూజలు....



పెద్ద శంకరంపేట్ ప్రజా జ్యోతిబీ

పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలగుడి వద్ద సంకటహర చతుర్థి పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.. వేద పండితులు కృష్ణ శర్మ బృందం ఆధ్వర్యంలో వేద పండితుల. వేదమంత్రోచ్ఛరణల మధ్య లోక కళ్యాణార్థం శాస్త్ర యుక్తంగా అభిషేకం యజ్ఞం విశేష పూజలు నిర్వహించారు.. గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ మంట పారాధన, వాస్తు మంట పారాధన, సర్వతోభద్రమంట పారాధన, స్వామివారికి సహస్ర నామాలతో పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు కొత్త ప్రభు, మరియు దంపతులు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు....

## సమత పాఠశాలలో రక్షబంధన్ వేడుకలు.



**కొండాపూర్ ప్రజా జ్యోతి** మండల పరిధిలో మన్సన్పల్లి గ్రామ సమత పాఠశాలలో మంగళవారం ఘనంగా రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా. ప్రధానోపాధ్యాయులు దావత్ రెడ్డి మాట్లాడుతూ.. నేను నీకు రక్ష.. నువ్వు నాకు రక్ష మనమిద్దరం కలిసి దేశానికి రక్ష అని నినాదంతోటి విద్యార్థులు ఒకరిని ఒకరు రాఖి కట్టుకొని, రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరిగింది. రాఖి పండుగ అనేది అన్నా చెల్లెలు అనుబంధానికి ప్రతీక, హిందువులలో పవిత్రమైన పండగ ఇది, భారతీయ పౌరులు ప్రతి ఒక్కరు సోదరా భావంతో గౌరవించుకునే రక్షాబంధన్, స్నేహపూర్వకంగా విద్యార్థులలో శాంతి మెలగాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూల్ యజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక తిప్పలు..

**వెల్దుర్తి ప్రజాజ్యోతి ఆగస్టు 12** వెల్దుర్తి మండలం నెల్లూరు గ్రామం చిన్న శంకరంపేట మండలం ధర్పల్లి గ్రామాల మధ్యలో గల హల్దీ వాగు నుండి చిన్న శంకరంపేట మండలం భగీర్తి పల్లి గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు మాయ కాల నవనీత భర్త సిద్ధిరాములు ఇంటి నిర్మాణం కోసం ట్రాక్టర్లో ఇసుక తరలిస్తుండగా, నెల్లూరు వైపు నుండి వెళ్లిన వెల్దుర్తి పోలీసులు ఈ ఆగస్టు 7న ట్రాక్టర్ ను పట్టుకొని వెల్దుర్తి తహసిల్దార్ కు అప్పగించారు. రూ. 50 వేల జరిమానా చెల్లిస్తేనే ట్రాక్టర్ విడిచిపెడతానని చెప్పడము బాధితుడు బతిమిలాడడం వల్ల చివరికి రూ .20,000 చెల్లించాలని చెప్పగా బాధితుడు సిద్ధిరాములు ధర్పల్లి మాజీ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి వద్దకు వెళ్లి తన గోడు విన్నవించడం జరిగింది. దీంతో రాజశేఖర్ రెడ్డి వెల్దుర్తి తహసిల్దార్ బాల లక్ష్మి తో మాట్లాడి పేదవాడు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసమే ఇసుకను తీసుకెళ్తున్నాడని, అందుకు రూ. 5000 డిడి చెల్లించి తీసుకొస్తామని, ట్రాక్టర్ ను విడిచి పెట్టాలని చెప్పి అతను వెళ్లిపోయారు. రూ. 5వేల డిడి కట్టి డిడి పత్రాలతో పాటు మంగళవారం నాడు రాజశేఖర్ రెడ్డి, బాధితుడు బాగిర్తి పల్లి గ్రామానికి చెందిన సిద్ధిరాములు తో కలసి వెల్దుర్తి తాసిల్దార్ కార్యాలయానికి వచ్చారు. డిడి తాసిల్దార్ బాల



లక్ష్మికి ఇవ్వగా 5,000 డిడిని ఎట్టి పరిస్థితిలో తీసుకోను అని 20,000 కట్టవలసిందే అని తాసిల్దార్ బాల లక్ష్మీ అన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఇంద్రమ్మ ఇంటి నిర్మాణం కోసం తీసుకెళ్తున్న ఇసుకను పట్టుకొని ఇంటి నిర్మాణం జరగకుండా అధికారులే అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్కు, తూప్రాన్ ఆర్డీవో కు ఫిర్యాదు చేస్తామని వెల్దుర్తి తాసిల్దార్ అడ్డగోలుగా జరిమానాలు విధించడం భావ్యం కాదని రాజశేఖర్ రెడ్డి, బాధితుడు సిద్ధిరాములు ఆవేదన వ్యక్తం చేశారు.

# సదాశివపేట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





**విధులకు హాజరు కాని డాక్టర్లపై**
**కలెక్టర్ అసహనం వ్యక్తం**

**సంగారెడ్డి , ఆగస్టు 12 , ప్రజా జ్యోతి న్యూస్ ప్రతిని :-** సదాశివపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల నాణ్యత, రోగులకు అందిస్తున్న సౌకర్యాలను జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య



మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఉదయం సమయంలో ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కలెక్టర్ ఆసుపత్రి ప్రాంగణంలో ప్రవేశించి, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. తనిఖీ సమయంలో ఉద్యోగుల హాజరు నమోదు రిజిస్టర్ పరిశీలించి, విధులకు హాజరు కాని కొంతమంది డాక్టర్లపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో సమయానికి హాజరయ్యేలా సూచనలు చేశారు. వైద్య సిబ్బంది సమయానికి హాజరయ్యేలా బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెడిసిన్ రిజిస్టర్ను పరిశీలించిన కలెక్టర్ , రోగులకు ఇవ్వాల్సిన మందుల చీటీని డాక్టర్లు పద్ధతి ప్రకారం కాకుండా తెల్ల కాగితంపై రాసి ఇస్తున్నారని గుర్తించారు. అలా రాయడం పారదర్శకత కాదని స్టాండర్డ్ ప్రిస్క్రిప్షన్ ప్యాడ్‌లను ఉపయోగించాలని వైద్యులకు సూచించారు. మందుల సరఫరా, స్టాక్ వివరాలు స్పష్టంగా నమోదు చేసి ఉండాలని ఆదేశించారు. అవసరమైన మందులు నిల్వలో ఉన్నాయా,రోగులకు అందించే ఔషధాల సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని,ఆదేశించారు . ఆసుపత్రి లో పేషెంట్లకు అందిస్తున్న భోజన మెనూ, వంట నాణ్యత, పరిశుభ్రతను ప్రత్యక్షంగా పరిశీలించారు చేశారు. ఆహారం రుచి, నాణ్యతను పరిశీలించి, భోజనం సమయానికి అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. సందర్భంగా పేషెంట్లతో కలెక్టర్ నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. మందులు సమయానికి అందుతున్నాయా, డాక్టర్లు, నర్సులు సరైన సమయానికి అందుబాటులో ఉన్నారా, శుభ్రత, ఆహారం వంటి అంశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతలో ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే సరిచేయాలని, నిరంతర శుభ్రత పాటించాలని సూచించారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య మాట్లాడుతూ ... జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు ప్రతి వైద్య సిబ్బంది తమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించాలని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడుతున్నందున, వారికీ అందిస్తున్న వైద్యసేవల నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా చూడాలని వైద్యులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి ,మండల పరిషత్ అధికారిణి లక్ష్మి , మునిసిపల్ కమిషనర్ ఉమ , వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యువజన దినోత్సవం




**సంగారెడ్డి , ఆగస్టు 12 , ప్రజా జ్యోతి న్యూస్ ప్రతినిధి :-** జిల్లా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం భాగంగా వశిష్ట డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి మాట్లాడుతూ, యువత తమ జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకొని, మంచి నడవడికతో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. అలాగే, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ చురుకైన పాత్ర వహించాలని, అందరూ దీనికి ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిద్ధ రెడ్డి, సీడీపీఓ అంజమ్మ, జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ పల్లవి, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ తోనే నారాయణఖేడ్ నియోజకవర్గం అభివృద్ధి.

**ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**



**కల్హే ర్. 12. ఆగస్టు ప్రజా జ్యోతి...** సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..నారాయణఖేడ్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అభివృద్ధి చెందిందని అన్నారు. అసత్య ఆరోపణలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డిపై ఆయన మండిపడ్డారు. గత పది ఏళ్లలో అధికారంలో ఉన్నప్పటికీ తండాలకు రహదారులు నిర్మించకపోగా ఇప్పుడు విమర్శలు చేయడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. భూపాల్ రెడ్డి తన కుమారుడి పేరుతో ఉన్న జెబీఆర్ కన్స్ట్రక్షన్‌కు గత ప్రభుత్వం 21 కాంట్రాక్టులు ఇచ్చినా పనులు పూర్తిచేయక ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. ఇప్పుడు పనులు చేస్తున్న కాంట్రాక్టర్లను బెదిరించడం తగదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అభివృద్ధి పనులు కొనసాగిస్తూ, ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తూ ముందుకు వెళుంది. బలహీన బడుగు పేద వర్ణాలకు ఇంద్రమ్మ ఇళ్ళను ఇవ్వడం. మహిళలకు కోటీశ్వరులు చేయడం అనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపుతో ముందు ఉందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ రైతు భరోసా.రైతు బీమా. గృహలక్ష్మి. వంటి పథకాలను రైతులకు అందించిన ముందుచూపు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, రమేశ్ చౌహన్,శంకర్ ముదిరాజ్,సర్దార్, అంజిరెడ్డి,నర్సింలు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలు జరిగితే తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలి

**పి ప్రావిణ్య జిల్లా కలెక్టర్**

**ప్రతి క్లస్టర్లో అధునాతన పరికరాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలి**

**ప్రమాదం జరిగినప్పుడు ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు అన్ని చర్యలు వెంటనే చేపట్టాలి**

**ప్రమాదం జరిగిన సమాచారం వెంటనే అన్ని శాఖల అధికారులకు అందించాలి**

**అన్ని క్లస్టర్లలో ప్రమాదకరమైన రసాయనాలు, అగ్నిప్రమాదాలు, పేలుడు ప్రమాదాలు , విష వాయువులు ఉత్పత్తి, నిల్వ లేదా వినియోగం చేసే పరిశ్రమలను గుర్తించాలి**



**సంగారెడ్డి , ఆగస్టు 12 , ప్రజా జ్యోతి న్యూస్ ప్రతినిధి** :-హై రిస్క్ కర్మాగారాలలో ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరిశ్రమల యాజమాన్యానికి కార్మికులకు అవగాహన కల్పించాలి సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పరిశ్రమలలో ప్రమాదం జరిగి స్థలాలు తనిఖీ చేయాలి పరిశ్రమలలో ప్రమాదాలు జరిగితే తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాలోని హైరిస్క్ కార్మాగారాలలో భద్రతా ప్రమాణాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలపై పరిశ్రమలు , కార్మిక శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక శాఖ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఐల తో పాటు మిగిలిన క్లస్టర్లలో ఇక్కడ ప్రమాదం జరిగిన ఆయ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో తక్షణమే స్పందించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇటీవల జరిగిన సిగాచి పరిశ్రమ విషాదం తర్వాత పరిశ్రమల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో సిగాచి లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అన్ని క్లస్టర్లలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రత్యేక బృందాలను 24 గంటల పాటు అందుబాటులో ఉంచాలన్నారు ప్రమాదం జరిగిందన్న సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీవ్రతను తగ్గించడంతోపాటు అవసరమైన సహాయక చర్యలు వెంటనే చేపట్టేలా వివిధ శాఖల అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలోని హై రిస్క్ కర్మాకారాలు సందర్శించి అంచనా వేసే కమిటీ సభ్యులు ఆయా పరిశ్రమలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన భద్రతా చర్యలు పరిశ్రమలు సందర్శించిన సమయంలో పరిశ్రమల యాజమాన్యం నుండి కార్మికుల పూర్తి వివరాలు సేకరించి ప్రమాదకర పరిస్థితులపై ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు పరిశ్రమలు ఉన్నాయా అవి పని చేస్తున్నాయా లేదా సరిచూసుకోవాలన్నారు అత్యవసర పరిస్థితులలో చేపట్టాల్సిన ప్రతిస్పందన చర్యలపై కార్మికులకు పరిశ్రమల యాజమాన్యానికి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు ప్రమాద నివారణలో భాగంగా సెల్ఫ్ కంప్లైయెన్స్ చెక్లిస్ట్ ను ప్రతి హైరిస్ గా పరిశ్రమలు తప్పనిసరిగా సిద్ధం చేసి చట్టబద్ధ పత్రంగా పరిగణించాలని కలెక్టర్ సూచించారు. ఇందులో ప్లాంట్ లేఅవుట్లు అగ్నిమాపక డ్రాయర్లు నిల్వలో ఉన్న లేదా వినియోగించే రసాయనాల పూర్తి జాబితా ప్రదర్శించాలని కలెక్టర్ అధికారులకు పరిశ్రమల యజమాన్యాలకు వివిధ శాఖల అధికారులకు సూచించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టేందుకు జిల్లాలోని పరిశ్రమలను ప్రత్యేకంగా క్లస్టర్లుగా విభజించి విపత్తు సంసిద్ధత మరియు రక్షణ ప్రణాళికలు సిద్ధం చేయించినట్లు కలెక్టర్ తెలిపారు భద్రత ప్రమాణాల లో రాజీలేదు: జిల్లాలోని పరిశ్రమలు అన్ని రకాల భద్రతా ప్రమాణాలు అమలు చేసే విధంగా ఆయా శాఖల అధికారులు రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు భద్రతా తనిఖీ ఒక వేధింపు చర్యకాకుండా కార్మికుల భవిష్యత్తు పరిశ్రమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చేపట్టాల్సిన కార్యక్రమంలో చూడాలని అధికారులకు సూచించారు యజమాన్యాలు అనవసరంగా వేధించద్దని కలెక్టర్ సూచించారు చిన్నచిన్న పెట్టుబడులతో అంతర్నిర్మిత భద్రతా వ్యవస్థలను అభివృద్ధి చేస్తే ప్రామాణాస్తం తగ్గించవచ్చని ఆమె అన్నారు. అన్ని పరిశ్రమలలో పేలుడు ఉపశమన పానెల్ లు భద్రత ఉపశమన వాల్వులు రియాక్టర్లకు పగిలిపోయే డిస్క్ వంటి లోపాలను వెంటనే సరి చేయాలని యజమాన్యాలను ఆదేశించారు .రెండు నెలల్లో తనిఖీ ప్రక్రియ పూర్తి: జిల్లా స్థాయి కమిటీలు వెంటనే షెడ్యూలు ప్రకారం తనిఖీలు ప్రారంభించి రెండు నెలలు మొత్తం ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలను వెంటనే పరిష్కరించేలా పరిశ్రమల యాజమాన్యంతో సమన్వయం కొనసాగుతుందన్నారు. ఈ సెన్సిటైజేషన్ డ్రైవ్ కేవలం తనిఖీ మాత్రమే కాకుండా పరిశ్రమలో భద్రత సంస్కృతిని పెంపొందించడం లక్ష్యంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అన్ని పరిశ్రమలు సీసీటీవీలో తప్పనిసరి: ఎస్పీ పరతోష్ పంకజ్. జిల్లాలోని అన్ని పరిశ్రమలలో సీసీటీవీలో నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ పరతోష్ పంకజ్ పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు పరిశ్రమల భద్రతలో సిసి టీవీ నిగా కీలకమైన ప్రతి ముఖ్యమైన ప్రదేశంలో కేవలం సక్రమంగా పనిచేయాలన్నారు చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా ఫుటేజ్ లో నిల్వ చేయడం ద్వారా ప్రమాదా నివారణ దర్యాప్తులో ఇది సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ కె. గౌరీ శంకర్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, తెలంగాణ ఫ్యాక్టరీల డైరెక్టర్ , వై. మోహన్ బాబు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి తుల్జా నాయక్ ,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వరద నీటిలో కొట్టుకపోయిన వ్యక్తి మృతి

రాయికోడ్ ఆగస్టు 12 (ప్రజాజ్యోతి) మండలంలోని యూసుప్పూర్ గ్రామ సమీపంలోని పిట్ట వాగులో ఓ వ్యక్తి కొట్టుకుపోయి మృతి చెందినట్లు స్థానిక ఎస్సై చైతన్య కిరణ్ తెలిపారు. వివరాలకు వెళ్లగా.. మండలం నుండి యూసుఫ్ పూర్ కు వస్తుండగా వాగు వరద ఉధృతంగా ప్రవహిస్తుండగా మ్యాతరి శ్రీనివాస్ దాటుతూ



ప్రమాదశవత్తు ఒక్కసారిగా కాలుజారి వాగులో పడగా రెండు కిలోమీటర్ల మెరుగా కొట్టుకపోయి ధర్మాపూర్ సుద్ద వాగు సమీపంలో తట్టుకొని ఉన్నాడు. మృతుని యొక్క అసలు మరణ కారణము తెలుసుకునుటకు గురించి ఎస్కార్ట్ ఎఫ్ట్ గారికి అప్పగించి జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు.

## తహసిల్దార్ డౌన్ డౌన్.. సిపిఎం నేత గౌరీ

**-కార్యాలయం ముందు సిపిఎం నేతల నిరసన**

**-తహసిల్దార్ వెంటనే క్షమాపణ చెప్పాలి**



**వెల్దుర్తి ప్రజా జ్యోతి ఆగస్టు 12** ప్రజాసమస్యలను అడిగిన తనపై తహసీల్దార్ బాలలక్ష్మీ దురుసుగా ప్రవర్తించారని, అవమానించే పదాలు వాడారని, సిపిఎం నేత మండల కార్యదర్శి గౌరీ తెలిపారు. వెల్దుర్తి మండలం బండ పోసాని పల్లి గ్రామానికి చెందిన చింతల గౌరీ గత కొన్నిఎలుగా సిపిఎం పార్టీలో పనిచేస్తు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా వ్యవహరిస్తున్నారు. మంగళవారం అదే తరహాలో వెల్దుర్తి తాసిల్దార్ బాల లక్ష్మి ఛాంబర్ కు గౌరీ వెళ్లి సమస్యలను తాసిల్దార్ కు విన్నవిస్తుండగా, ఎకంగా తాసిల్దార్ అగ్రహానికి గురై గౌరీ మండల నేత అని చూడకుండా మీకు కామన్ సెన్స్ ఉందా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనితో అవమానానికి గురైన గౌరీ, కార్యాలయం ఆవరణలో బైటాయించి తహసిల్దార్ కు వ్యతిరేకంగా పార్టీ కార్యకర్తలతో ఆందోళన చేపట్టారు. తహసిల్దార్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అప్పటికూడా తహసిల్దార్ స్పందించకుండా కార్యాలయంలోనే కూర్చున్నారు. విషయం తెలుసుకున్న తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి కల్పించుకొని సిపిఎం జిల్లా బాధ్యులు మహేందర్ రెడ్డి కి ఫోన్ చేసి కార్యాలయం వద్ద రాదంతం వద్దని ఎవైనా సమస్యలు ఉంటే నేరుగా నావద్దకే రావాలని ఒకటి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో, గౌరీ ఆందోళన విరమించారు. వెల్దుర్తి తహసిల్దార్ కార్యాలయం లో పనులు సకాలంలో జరగడంలేదని, స్తంభించిపోతున్నాయని, చిన్న చిన్న పనులకు, నేలలుగడుస్తున్న కావడంలేదని, తాసిల్దార్ తీరుపై, ప్రజలు, మండిపడుతున్నరు.

## స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ చేసిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు కృష్ణ టేక్మాల్

(ప్రజాజ్యోతి ప్రతినిధి): మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొడ్మట్ పల్లిలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు అయిన




సుంకరి కృష్ణ వారి యొక్క తల్లిదండ్రులైన సుంకరి సుశీల నరసింహులు జ్ఞాపకార్థం వారు తన సొంత డబ్బులతో మంగళవారం రోజున జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొడ్మట్ పల్లి లో 110 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ లను అందించారు. విద్యార్థుల ఆనందానికి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. అనంతరం విద్యార్థులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ బడుల్లో వినుత్నంగా ప్రత్యేక దుస్తులు అందించినందుకు గాను ఉపాధ్యాయులు కృష్ణ పట్ల గ్రామ ప్రజలు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు స్వప్న, ఉపాధ్యాయులు లత, నాగరాణి, అశోక్, దశరథ్ మౌలాన, తదితరులు పాల్గొన్నారు.

# టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన స్కూల్ టీచర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎస్ టి ఎఫ్ ఐ. 26వ ఆవిర్భావ దినోత్సవం



**కల్హ ర్./ నారాయణఖేడ్ 12.ఆగస్టు.ప్రజా జ్యోతి** సీపీస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి, నూతన జాతీయ విద్యా విధానం 2020ని రద్దు చేయాలి యూపీస్,పీస్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలి టీఎస్ యుటిఎఫ్ నారాయణఖేడ్ డివిజన్ ఆధ్వర్యంలో స్కూల్ టీచర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా( ఎస్ టి ఎఫ్ ఐ ) 26వ ఆవిర్భావ దినోత్సవాన్ని నారాయణఖేడ్ పట్టణంలోని టీఎస్ యుటిఎఫ్ భవన నిర్మాణం కొరకు ప్రభుత్వం కేటాయించిన స్థలం వద్ద (బస్ డిపో వెనకాల నారాయణఖేడ్) టీఎస్ యుటిఎఫ్ సంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు సీనియర్ నాయకులు నాగయ్య గారు ఎస్ టి ఎఫ్ ఐ జెండాను ఆవిష్కరించడం జరిగింది. ఈసందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకోవడం జరిగింది. అనంతరం టీఎస్ యుటిఎఫ్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సీనియర్ నాయకులు బి.ఏసప్ప గారి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన టీఎస్ యుటిఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు,జిల్లా ఉపాధ్యక్షులు, కె.అశోక్,కాశీనాథ్ జాదవ్ లు మాట్లాడుతూ స్కూల్ టీచర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయస్థాయిలో ఆగస్టు 12వ తేదీ 2000 సంవత్సరంలో ఆవిర్భవించిందనీ ఎస్ టి ఎఫ్ ఐ లో భాగస్వామి సంఘంగా తెలంగాణ రాష్ట్రం నుండి టీఎస్ యుటిఎఫ్ తోపాటు దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల నుండి 25 సంఘాలతో ఏడు లక్షల మంది ఉపాధ్యాయులకు ప్రాతినిథ్యం గల జాతీయస్థాయిలో అతిపెద్ద సంఘమని, భారతదేశవ్యాప్తంగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై దేశవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ చేసి రాష్ట్రపతి చేయాలని కోరుతూ ఢిల్లీలో విద్యా సదస్సు నిర్వహించిందని, 2006,2016 సంవత్సరాలలో నవంబర్ మాసాలలో సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ మార్చి టు పార్లమెంట్ నిర్వహించిందని,అదేవిధంగా నూతన జాతీయ విద్యా విధానం 2020ని రద్దు చేయాలని, పిఎస్ యుపిఎస్ లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని,ప్రభుత్వ రంగంలో విద్య ఉండాలనే,బడ్జెట్లో 10 శాతం,జీడీపీలో 6 శాతం విద్యకు కేటాయించాలని,విద్య రాష్ట్ర జాబితా ఉండాలని,విద్యా వ్యాపారికరణ ఆపాలని పోరాటం చేసిందన్నారు.అదేవిధంగా ఎస్ టి ఎఫ్ ఐ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 8, 9,10 తేదీలలో కలకత్తాలో జరిగిన రజతోత్సవ మహాసభల సందర్భంగా తెలంగాణ రాష్ట్రం నుండి టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేస్తున్న కామ్రేడ్ చావ రవి గారిని ఎస్ టి ఎఫ్ ఐ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు టీఎస్ యుటిఎఫ్ సంగారెడ్డి జిల్లా కమిటీ పక్షాన అభినందనలు తెలియజేస్తున్నాం. అదేవిధంగా రజతోత్సవ మహాసభల సందర్భంగా తీర్మానించిన అంశాలైన సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు,నూతన జాతీయ విద్యా విధానం 2020 రద్దు, యుపిఎస్ పిఎస్ లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పన, దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ విద్యా రంగ సమస్యల పరిష్కారం, బడ్జెట్లోవిద్యకు10 శాతం జీడిపి లో ఆరు శాతం కేటాయింపు, దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న పది లక్షల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, విద్య వ్యాపారి కరణ ఆపటం, సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పద్ధతులలో పనిచేస్తున్న ఉద్యోగులకు రెగ్యులరైజ్ చేయాలి తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 2025 నుండి డిసెంబర్ 2025 వరకు 4 నెలల పాటు దశలవారీగా దేశవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వారు కోరారు. ఈకార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శిలు బి. ఏసప్ప, నరేష్, హరిసింగ్ మరియు నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏసుదాస్, శ్రీ రామ్ నాయక్, రాములు, శివకుమార్, విట్టల్, అంజయ్య, జావిద్, దేవిసింగ్, సర్దార్, రవి నాయక్, సంతోష్, సచిన్, ప్రవీణ్, పండరి, జై రామ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణ కోసమే ప్రత్యేక ఆయుధం. షీ టీం. ఏర్పాటు.

**నిస్సందేహంగా షీ టీం మహిళలకు అన్ని రకాల భద్రతపై అవగాహన కలిగిస్తుంది.. ఏఎస్ఐ తులసీరామ్ చౌహాన్**




**కల్హ ర్. 12. ఆగస్టు ట(ప్రజా జ్యోతి ఊ** మహిళల రక్షణ కోసమే తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం షీ టీం ఏర్పాటు చేసినట్లు షీ టీం ఏఎస్సై తులసిరాం చౌహన్ అన్నారు.. కాలేజ్. పాఠశాల. రద్దీగా ఉండే బస్టాండ్లలో లో జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోకిరిల నుండి మహిళలను కాపాడడానికి, వారికి ఏదైనా సమస్య వస్తే తక్షణ సహాయం కోసం షీ టీం పనిచేస్తుంది అన్నారు. బస్టాండ్, పాఠశాల, కళాశాలల వద్ద పోలీస్ యూనిఫామ్ లో కాకుండా సాధారణ బట్టలలలో, సాధారణ వ్యక్తుల వలేనే పోలీసులు విధులు నిర్వహిస్తారు అన్నారు.విద్యార్థినులకు, మహిళలకు మగవారు లేదా పోకిరిలు ఏదైనా ఇబ్బందులు కలిగించిన, ర్యాగింగ్ లాంటివి చేసిన షీ టీం సభ్యులకు తెలియజేయాలి అన్నారు. అదేవిధంగా ప్రతీ ఒక్కరు సైబర్ క్రైమ్ నేరస్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యాట్సాప్ లలో ఏవైనా లింకులు ఓపెన్ చెయ్యమంటే చెయ్యరాదనీ, ఇతరులకు ఓటిపి చెప్పరాదు అన్నారు.ఆడపిల్లలకు 18 ఏళ్ళు నిండిన తర్వాతనే వివాహం చేయాలని, బాల్య వివాహాలు నేరము అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుభాష్, మహిళా కానిస్టేబుల్ చాంగుభాయి, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం సభ్యులు నర్సింలు తదితరులు ఉన్నారు.

# భారీ వర్షాల దృష్ట్యా జిల్లాలో హై అలర్ట్.

**రానున్న 72 గంటల పాటు జిల్లాకు భారీ వర్ష సూచన వాతావరణ శాఖ హెచ్చరికలు .**

**లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉండే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి**

**అత్యవసరమైతే తప్ప ఇళ్లలో నుండి బయటికి రాకూడదు.**

**సమయంలో డైల్ 100 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712656739 నంబర్ ను సంప్రదించండి.**

**జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**



**సంగారెడ్డి... కొండాపూర్.. ప్రజా జ్యోతి** రానున్న 72 గంటల పాటు జిల్లాలో భారీ వర్షాల కురుస్తాయని, వాతావరణ శాఖ సూచించిందని, భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్లలో నుండి బయటికి రాకూడదని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని జిల్లా ఎస్పీ పరితోష పంకజ్ సూచించారు. ప్రమాద కారణాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉండే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని అన్నారు. జలాశయాలు చెరువులు, కుంటలను చూడడానికి వెళ్లకూడదని, జలాశయాలు నిండు కుండలా మారి ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉంటుందన్నారు. పొంగి పొర్లుతున్న వాగులను దాటడానికి ప్రయత్నించకూడదని అన్నారు. అత్యవసర సమయంలో డైల్ 100 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712656739 ను సంప్రదించవలసిందిగా సూచించారు. జిల్లా పోలీసు అధికారులు 24 7 అనుబాటులో ఉండి అప్రమత్తంగా ఉండాలని, చెరువులు కుంటలకు చూడటానికి ఎవ్వరూ వెళ్ళకుండా ప్రమాద సూచిక బోర్డ్ లను ఏర్పాటు చేసే విధంగా చూడాలన్నారు. యస్.హెచ్.ఒ. లు ప్రత్యేకంగా తమ తమ ఏరియాలో ఉన్న చెరువులు కుంటలను సందర్శించి, ప్రమాద అంచున ఉన్న ఆనకట్టల సమాచారం అందించాలని అన్నారు. భారీ వర్షాల దృష్ట్యా పాటించవలసిన జాగ్రత్తలు: లి లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకూడదు. ప్రమాద కారణాల దృష్ట్యా చెరువులు, కుంటలను చూడటానికి వెళ్లారాదు. రైతులు పొలాలో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలి. విద్యుత్ స్తంభాలను గాని, వైర్లను కానీ చేతులతో తాకకకూడదు,నీరు నిలువ ఉన్న విద్యుత్ స్తంభాల దగ్గర నుండి వెళ్లారాదు,వాగులు వంకలు బ్రిడ్జ్ లపై నుండి పొంగి, పొరలే సమయంలో దాటాడానికి ప్రయత్నించరాదన్నారు. పాడైన పాత భవనాల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల ప్రక్కన నివాసం ఉండరాదన్నారు.

# రోగుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

**జిల్లా కలెక్టర్ కె . హైమావతి**



**నంగునూరు ( ప్రజా జ్యోతి)** నంగునూరు మండలం లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని , రోగుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. నంగునూరు మండలంలోని రాజగోపాలపేట గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.అటెండర్ రిజిస్టర్, ఓపి రిజిస్టర్ వెరిఫై చేస్తూ అందరి డిప్యూటెషన్లో రద్దు చేశామని తెలిపారు. ఓపి రిజిస్టర్ మెడికల్ ఆఫీసర్ మాత్రమే రాయాలని స్టాఫ్ నర్స్ రాస్తూ మెడిసిన్ అందజేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సీజనల్ వ్యాధులకు సంబంధించి అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ను ఆదేశించారు

# 8 నెలల నుంచి గ్రామంలో నిలిచిపోయిన చెత్త సేకరణ

-యధావిధిగా చెత్త సేకరణ చేయాలని
ముంగిస్ పల్లి గ్రామ ప్రజల ఆవేదన



**రాయపోల్ ఆగస్టు 12 ప్రజా జ్యోతి**దేశానికే పట్టుకొమ్మలు గ్రామాలని, గ్రామాలు పచ్చదనం పరిశుభ్రతతో అభివృద్ధి పథంలో నడిస్తే దేశ అభివృద్ధి చెందుతుందని గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి పారిశుద్ధ్యం పరిశుభ్రం చేయడానికి ప్రతి గ్రామంలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లను కొనుగోలు చేసి వాటి నిర్వహణ గ్రామ పంచాయతీలకు అప్పజెప్పింది. నాటి నుంచి గ్రామాలలో ప్రజలు రోడ్లమీద వీధులలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ప్రతిరోజు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఇచ్చే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ చెత్త సేకరణ చేస్తూ గ్రామాలలోని డంపింగ్ యార్డ్ కు తరలించి సేంద్రియ ఎరువు తయారికి ప్రోత్సహించారు. కొంతవరకు గ్రామాలు పరిశుభ్రంగా వీధులలో చెత్త చెదారం లేకుండా తీర్చిదిద్దబడ్డాయి. అనంతరం జరిగిన ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ ఓటమి చెందడం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ప్రభుత్వం మారిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం రజుకి నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం లోటు బడ్జెట్ ఉందని ఆర్థిక భారం ఎక్కువైందని గ్రామ పంచాయతీలకు నిధులు రావడం లేదు. దానితో గ్రామాలలో ఎలాంటి పనులు జరగడం లేదు. మురికి కాలువలు శుభ్రం చేయడం, దోమలు ఈగల నివారణకు మందును పిచికారి చేయడం, వీధి దీపాలు ఏర్పాటు చేయడం, మంచినీటి సమస్య ఇలా ఏ పనులు సక్రమంగా కొనసాగడం లేదు. వాటితో పాటు చెత్త సేకరణ కూడా ఆగిపోవడంతో ట్రాక్టర్లు మూలన పడ్డాయి. ఇది ఇలా ఉండగా రాయపోల్ మండలంలోని ముంగిస్ పల్లి గ్రామ పంచాయతీ చెత్త ట్రాక్టర్ చెట్ల పొదల మధ్యన నిలిపి ఉంచడంతో వర్షాలకు పచ్చగడ్డి, పిచ్చి మొక్కలు, చెట్లు ఏపుగ పెరిగి ట్రాక్టర్ కనిపించకుండా పోతుంది. గత ఎనిమిది నెలల నుంచి ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, మండల అధికారులు స్పందించి గ్రామంలో చెత్త సేకరణ కోసం యధావిధిగా ట్రాక్టర్ నడపాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# రేవంత్ పాలనలో మార్పు షురూ

-రైతులను హరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం
-మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి



**తొగుట ఆగస్టు12( ప్రజా జ్యోతి ) :** మార్పు రావాలంటే కాంగ్రెస్ రావాలన్న సీఎం రేవంత్ రెడ్డి పాలనలో మార్పు షురూ అయిందని, బస్తా యూరియా కోసం రైతులు హరిగోస పడుతున్నారని మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని స్థానిక రైతు ఆగ్రోస్ సేవా కేంద్రం వద్ద రైతులు యూరియా కోసం పడుతున్న ఇబ్బందులను చూసి ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా కోసం రైతులు బారులు తీరగా వారితో కలిసి మాట్లాడారు.. రైతులకు సరిపడా యూరియాను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అయన మండిపడ్డారు. పత్తి చేలు గూడకు వొచ్చిందని, వరి కలుపు దశలో ఉందని, మొక్కజొన్న చేలు ఎదుగుదల ఆగిపోయిందన్నారు. రైతులకు సకాలంలో యూరియాను అందించకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ప్రభుత్వ అసమర్థ పాలన వల్లనే నేడు మల్లన్న సాగర్లోకి నీటిని తరలించడం లేదన్నార .కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వాన్ని బద్నామ్ చేస్తూ కాల యాపన చేయడం తప్ప చేసిందేమి లేదన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లో ఉందని జబ్బలు చిరిచే నాయకులకు రైతుల సమస్య లు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు.. కెసిఆర్ ప్రభుత్వంలో ఏనాడు యూరియా కోసం రైతులు రోడ్డెక్కిన పరిస్థితులు లేవని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు జీలుగ, జనుము విత్తనాలు దొరకడం లేదని, యూరియా, కరెంట్ సమస్య లు రాజ్యమేలుతున్నాయన్నారు.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.మల్లన్న సాగర్ రిజర్వాయర్ నిర్మించిన గత ప్రభుత్వాన్ని విమర్శలు చేయడం మానుకొని అసంపూర్తిగా ఉన్న కాలువల నిర్మాణాన్ని పూర్తిచేసి రైతులకు సాగుకు నీరు అందించి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దోమల కొమురయ్య మాట్లాడుతూ భార్యాభర్తలిద్దరూ యూరియా కోసం లైన్లో వేచి ఉండడం చూస్తే గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన గుర్తుకొస్తుందన్నారు. ప్రజా పాలన అంటే రైతులకు కావలసిన ఎరువులను, విత్తనాలను సకాలంలో అందించడం అని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చర్య తీసుకుని రైతులకు కావలసిన యూరియాను అందించాలని తెలియజేశారు.

# బిసి గర్జనను విజయవంతం చేయాలి

బిఆర్ఎస్ యువనేత పరశురామ్



**జగదేవపూర్: ఆగస్టు 12(ప్రజాజ్యోతి)** ఈనెల 14న కరీంనగర్లో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన బీసీ గర్జనను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ యువనేత పరశురామ్ వాటా కల్పించాలని డిమాండ్ తో బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ కరీంనగర్లో బీసీ గర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బిజెపి బీసీల పేరుతో డ్రామాలాడుతున్నాయని ఆరోపించారు. బిఆర్ఎస్ బీసీల పక్షపాతం అని బీసీ హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసేది బిఆర్ఎస్ ఒకటేనని అన్నారు. మండలంలోని బిఆర్ఎస్ బీసీ నేతలు అధిక సంఖ్యలో బీసీ గర్జనకు తరలిరావాలని కోరారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు బీసీ గర్జనకు హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు.

## సభకు బయలెల్లిన ముదిరాజ్ లు



**జగదేవపూర్: ఆగస్టు 12(ప్రజాజ్యోతి)** తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం కొంపల్లిలో జరిగే సభకు జగదేవపూర్ మండలం నుంచి అధిక సంఖ్యలో ముదిరాజ్ సంఘం నేతలు వాహనాల్లో తరలి వెళ్లారు. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాగుల రాజు, కార్యదర్శి హేమ సురేష్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘం నేతలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజుల హక్కుల కోసం రాజకీయంగా భవిష్యత్తు కోసం తెలంగాణ ముదిరాజుల పోరాట సమితి వ్యవస్థాపకులు నీలం మధు ఆధ్వర్యంలో కొంపల్లిలో సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. సభకు జగదేవపూర్ మండలం నుండి భారీ వాహనాల్లో తరలి వెళ్లినట్లు తెలిపారు. ముదిరాజులు ఆర్థికంగా రాజకీయంగా రాణిస్తూ హక్కుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రాజు, బాలకిషన్, జయమ్మ, కరుణాకర్, బాలయ్య, నరసింహులు, రమేష్, కనకయ్య, రవి, గణేష్, బాలరాజ్, రాజు, శ్రీకాంత్, సత్యం తదితరులు ఉన్నారు.

## పేదలకు అండగా...కాంగ్రెస్ ప్రభుత్వం...!

- తిగుల్ గ్రామ మాజీ సర్పంచ్ భాను ప్రకాష్ రావు



**జగదేవపూర్ : ఆగస్టు 12(ప్రజాజ్యోతి)** పేద ప్రజలకు సిఎం సహాయ నిధి వరం అని తిగుల్ గ్రామ మాజీ సర్పంచ్ కప్పర భాను ప్రకాష్ రావు అన్నారు. మండలం లోని పలు గ్రామాలకు చెందిన సర్దెగని బాల్ నరసమ్మ, గొర్లకడి ఉప్పలమ్మ, అలకుంట కనక రాజు, ముక్కెర నర్సింలు, చంద్ర రెడ్డి, ఆకుల లక్ష్మణ్, గుర్జకుంట నిర్మల, గుండ్రు స్వామి, కొంతం వెంకటేష్, రిషిత్ రెడ్డి, లకు సిఎం సహాయనిధి చెక్కులను టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు సహకారంతో మంజూరైన రూ.6 లక్షల 80 వేల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు తిగుల్ గ్రామ మాజీ సర్పంచ్ కప్పర భాను ప్రకాష్ రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాను ప్రకాష్ రావు మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జగదేవపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు 6.80 వేల రూపాయల చెక్కులను అందజేయడం జరిగిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేద ప్రజల ప్రభుత్వం అని పేర్కొన్నారు. ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రతి పేద కుటుంబానికి సబ్బండ వర్గాలకు పార్టీలకు అతీతంగా పనిచేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బునారి రాజు, కాంగ్రెస్ నాయకులు కిష్టయ్య, స్వామిలు పాల్గొన్నారు.

# బీమా రైతుకు ధీమా

- నేడే దరఖాస్తులకు ఆఖరి
- వ్యవసాయ అధికారి వసంతరావు

**జగదేవపూర్: ఆగస్టు 12(ప్రజాజ్యోతి)** విద్యుత్ ఘాతం, అనారోగ్యం, ఆత్మహత్య ఇలా మృతి చెందిన రైతులను ఆదుకోనేందుకు ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వం ఈ పథకం గడువును పొడిగించింది. ఈ సంవత్సరానికి కొత్తగా అర్హులైన వారు నమోదు చేసుకోవడంతోపాటు ప్రస్తుత లబ్ధిదారుల వివరాల్లో మార్పులు చేర్పులు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అనారోగ్యం లేదా ప్రమాదవశాత్తు ఇలా ఏవిధంగా మృతి చెందిన బాధ్యత రైతు కుటుంబానికి రూ. ఐదు లక్షల సహాయం అందిస్తుంది. ఈ పథకానికి అవసరమైన ప్రీమియం ప్రభుత్వామే చెల్లిస్తుంది. అర్హులైన రైతులు ఈ నెల 13 లోగా స్థానిక మండల వ్యవసాయ అధికారులకు దరఖాస్తులు అందచేయాల్సి ఉంటుంది. అర్హతలు ఇవీ.. రైతుకు చెందిన కు పొలానికి సంబంధించిన పట్టా పాస్ పుస్తకం కలిగి ఉండాలి. భూభారతిలో పాస్ పుస్తకం 5-6 2025 లోపు నమోదై ఉండాలి. ఆధార్ కార్డులో వయసు 18 నుండి 59 లోపు ఉండాలి. అంటే 14-08-1966 నుండి 14-08-2007 లోపు జన్మించిన వారు అర్హులు. ఎన్ని చోట్ల భూమి ఉన్న భీమాకు మాత్రం ఒకచోటనే అవకాశం ఉంటుంది. సంబంధించిన రైతులు




వారే స్వయంగా కార్యాలయానికి వెళ్లి అధికారి సమక్షంలో దరఖాస్తు అందజేయాలి. పట్టా పాస్ పుస్తకం ఆధార్ కార్డు నామిని ఆధార్ కార్డు పత్రులను అందజేయాలి. గతంలో భీమాపాలసి ఉన్నవారు తిరిగి దరఖాస్తు చేసుకోనవసరం లేదు. వ్యవసాయ శాఖే రెన్యువల్ చేస్తుంది. సద్వినియోగం చేసుకోవాలి రైతు బీమా గడువు పొడిగించడంతో అర్హులైన రైతులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి. అర్హులైన వారు కూడా కొందరు దరఖాస్తు చేసుకోవడం లేదు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నేడే దరఖాస్తులకు చివరి అవకాశం. రైతు వేదికలో ఏఈఓలకు దరఖాస్తులు ఇవ్వాలి.

# చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- ఎస్ఐ కృష్ణారెడ్డి

**జగదేవపూర్: ఆగష్టు 12(ప్రజాజ్యోతి)** జగదేవపూర్ మండలంలో ఇటిక్యాల జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం విద్యార్థినీ విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, సైబర్ నేరాల గురించి, గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు, ఈవిటీజింగ్ నూతన చట్టాల గురించి షీ టిం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణారెడ్డి, మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా మహిళల రక్షణకు పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం ప్రత్యేక షెడ్యూల్లో భాగంగా మంగళవారం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. సోషల్ మీడియా, మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మికుల పనిచేసే చోట వేధింపులు, గుడ్ టచ్ బాడ్ టచ్, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు, సైబర్ నేరాలు సైబర్ బెదిరింపులు, మైనర్ డ్రైవింగ్, అపరిచిత వ్యక్తుల పట్ల ఉండవలసిన జాగ్రత్త చర్యలు తదితర అంశాల గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఎవరన్నా అవహేళన చేసినట్లు మాట్లాడినా అసభ్యకరంగా మాట్లాడిన




ఇలాంటి వేధింపులకు గురిచేసిన వెంటనే డయల్ 100, లేదా సిద్దిపేట షీటీమ్ నెంబర్ 8712667434 కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ మాధవరెడ్డి, మరియు ఉపాధ్యాయులు, గజ్వేల్ షీటీమ్ బృందం హెడ్ కానిస్టేబుల్ మహేందర్ రెడ్డి, మహిళా కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుళ్లు మహేష్, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# టిఎంపిఎస్ ఆవిర్భావ సభకు తరలి వెళ్లిన ముదిరాజ్ నాయకులు

**హుస్నాబాద్, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):** హైదరాబాదులో మంగళవారం నిర్వహించిన టిఎంపిఎస్ ఆవిర్భావ సభకి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం నుండి ముదిరాజ్ నాయకులు తరలి వెళ్లారు.



ముదిరాజులను బిసి-డి గ్రూప్ నుండి బీసీఏ గ్రూపులోకి వెంటనే చేర్చాలని ముదిరాజ్ కార్పొరేషన్ కు 1000 కోట్ల నిధులు వెంటనే కేటాయించాలి అని నామినేటెడ్ పదవుల్లో ముదిరాజులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని మహబూబ్ నగర్ జిల్లాను పండుగ సాయన్న జిల్లాగా మార్చాలని పండుగ సాయన్న కరువు కృష్ణస్వామి జయంతులను అధికారికంగా నిర్వహించాలని రాష్ట్రంలో ఉన్నటువంటి మత్స్యకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి అనే డిమాండ్లతో ఈ సభను ఏర్పాటు చేసినట్లు ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి జనవేని శ్రీనివాస్ ముదిరాజ్, సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు సుంకర ప్రదీప్ ముదిరాజ్, నియోజకవర్గ ఇన్చార్జ్ ఎదల రమేష్ ముదిరాజ్, హుస్నాబాద్ మండల ఇంచార్జ్ దొంతరవేని శ్రీనివాస ముదిరాజ్, హుస్నాబాద్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కొన్న మల్లయ్య, సంఘ కార్యదర్శి శ్రీనివాస్, పోతారం ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సున్నపు రమేష్, కార్యదర్శి మేడవేణి ఆంజనేయులు, పినకాశి రమేష్, కాశీబోయిన రవి ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, మహేష్ ముదిరాజ్, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## నెంటూర్లో స్పోర్ట్స్ డ్రెస్సుల పంపిణీ



జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన మహమ్మ ద్ అజాజ్ హుర్ రహమాన్, చంద్రం యాదవ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్సులను అందజేశారు. అలాగే రంగు స్వామి గౌడ్ ఆర్థిక సహాయంతో స్పోర్ట్స్ వస్తువుల కొరకు 10వేల రూపాయలనగదును విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గం మామిడి వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్ నాయకులు నిమ్మ సురేందర్ రెడ్డి మాజీ ఉపసర్పంచ్ కొండల్ రెడ్డి లతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఆకస్మికతంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

డాక్టర్ బి. అనురాధ



చిన్నకోడూరు (ప్రజా జ్యోతి ఆగస్టు 12 మండలకేంద్రం లోని పోలీస్ స్టేషన్ ఆకస్మికగా తనిఖీ చేసి చుట్టూ పరిసర ప్రాంతాలను, మరియు సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్ రికార్డ్స్, రైటర్ రూమ్ పరిశీలించారు పనిచేసే పరిసర ప్రాంతాలు పోలీస్ స్టేషన్ ఆవరణ శుభ్రంగా ఉండాలన్నారు పోలీస్ స్టేషన్లో వివిధ కేసులలో ఉన్న వాహనాల యొక్క అడ్రస్ తెలుసుకుని సంబంధిత యజమానులకు అప్పగించాలన్నారు పోలీస్ స్టేషన్ రికార్డ్స్ తనిఖీ చేసి ఎప్పటికప్పుడు అప్డేట్ ఉండాలన్నారు, కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు, విధినిర్వహణలో అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవు అన్నారు, ప్రజల ధన,మాన, ప్రాణరక్షణ విధులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు ఎస్ఐ మరియు సిబ్బంది ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నిజాయితీగా సేవలు అందించాలన్నారు బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ విధులు నిర్వహించే సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు త్వరలో జరుగు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి త్వరగా కేసులను పరిష్కరించాలి, ఇసుక, జూదం, పిడిఎస్ రైస్, అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు కేసులు నమోదు చెయ్యాలన్నారు పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలు మరియు పోలీస్ స్టేషన్ రికార్డ్స్, సిడి ఫైల్స్, తనిఖీ చేశారు ప్రతి రికార్డ్ అప్డేట్ ఉండాలన్నారు (విపిఓ) విలేజ్ పోలీస్ ఆఫీసర్ కేటాయించిన గ్రామాలకు కేటాయించిన వార్డులకు తరచుగా సందర్శిస్తూ ఇన్ఫర్మేషన్ వ్యవస్థను మెరుగు పరచాలన్నారు ,విజిబుల్ పోలీసింగ్ పై దృష్టి సారించాలని ఉదయం సాయంత్రం విసేబుల్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని అధికారులకు సిబ్బందికి సూచించారు.పాత నేరస్తులైన కేడీలు, డీసీలు, సస్పెక్ట్ లను తరచుగా తనిఖీలు చేయాలని సూచించారు. పాత నేరస్తులపై నిఘా ఉండాలన్నారు సైబర్ నేరాల పట్ల, గంజాయి ఇతర మత్తుపదార్థాలపై గ్రామాలలోని ప్రజలకు యువకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి ఈ కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను, చిన్నకోడూర్ ఎస్ఐ సైఫ్ అలీ, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, ఎస్బి ఎస్ఐ చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.